మాట్లాడుతున్న కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్

ఆ రోడ్డుపై ప్రయాణం ప్రమాదమే..

- బురదమయంగా సింగవరం రోడ్డు
- ద్విచక్ర వాహనదారులకు, పాదచారులకు తప్పని కష్టాలు - పట్టించుకోని అధికారులు

గుంతలు పడిన రోడ్డులో ఇబ్బందులు పడుతున్న వెళ్తున్న వాహనదారులు

బురదలో నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

వాహనదారులు, పాదచారులు ఆ రోడ్డు వెంట ప్రశాంతంగా ప్రయాణాన్ని కొనసాగించే పరిస్థితి లేదు. అక్కడ వాహనం నడపాలన్నా, పాదచారులు ఆ రోడ్డును దాటాలన్న సాహసమే చేయాల్సి ఉంటుందంటే ఏమాత్రం అతిశయోక్తి కాదు. ఇది కర్నూలు మండలం, జి.సింగవరం గ్రామంలో ఏర్పడిన దుస్థితి. కర్నూలు– సుంకేసుల ప్రధాన రహదారి గత నాలుగేళ్ల క్రితం అత్యంత దుర్భరంగా ఉండింది. రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు చేసిన పోరాటంలో ఈ రోడ్డు నిర్మాణానికి గత ఏడాది గత ప్రభుత్వం దిగివచ్చి ఎట్టకేలకు పనులు చేపట్టింది. ఇక్కడి దాకా అంతా సరిగా ఉన్నా గ్రామం గుండా వెళ్లే ఈ రోడ్డులో బస్టాండ్ నుంచి కెసి కెనాల్ వరకు రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయలేదు. దీని వెనక రాజకీయ కక్ష సాధింపు చర్యలు కూడా ఉన్నాయన్న విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. ఆ సంగతి అలా ఉంచితే అసలే అస్తవ్యస్తంగా ఉన్న ఈ రోడ్డుపై దారి సామర్థ్యానికి మించి భారీ వాహనాలు ఇసుక, కంకర తరలించే టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లు రాకపోకలు సాగించడంతో రోడ్డు పరిస్థితి పెనం నుంచి పొయ్యిలోకి పడినట్లు తయారయింది. దీంతో రోడ్డు మోకాళ్ల లోతు గుంతలతో అస్తవ్యస్తంగా మారింది. ఫలితంగా సాధారణ వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. ఇటీవలే ఆ రోడ్డులో ప్రైవేటు వ్యక్తులు గుంతలను మట్టితో నింపి చదును చేసే ప్రయత్నం చేశారు. అయితే ఇటీవల కురుస్తున్న వర్షాలతో రోడ్డు పూర్తిగా బురదమయంగా మారి సామాన్యుడు కాలు నేలపై పెట్టే పరిస్థితి లేకుండా పోయింది. రోడ్డు వెంట ప్రయాణించాలంటే ద్విచక్ర వాహనదారులు, స్థానికులు ఫీట్లు చేయక తప్పని పరిస్థితి నెలకొంది. గ్రామంలో పలువురు రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్లుతుండగా కాలుజారి కిందపడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ రోడ్డును బాగు చేయాలని గతంలో సిపిఎంతో పాటు డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. అనేకమంది ప్రజాప్రతినిధులకు, అధికారుల దృష్టికి సైతం సమస్యను తీసుకెళ్లారు. స్థానిక గ్రామ ప్రజలు సైతం రోడ్డుపై భారీ వాహనాలను అడ్డగించారు. అయితే సమస్య ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి తయారయింది. ప్రస్తుత టిడిపి ప్రభుత్వమైనా సమస్యపై దృష్టి సారించి పరిష్కారానికి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలి

ప్రభుత్వం వెంటనే చొరవ చూపి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలి. ప్రజల జీవితాలతో చెలగాటమాడడం సరికాదు. రోడ్డు నిర్మాణం చేపట్టే విధంగా అడుగులు ముందుకు వేయాలి.

- డి.రాఘవేంద్ర, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు.

కాంట్రాక్టర్ కోర్టును ఆశ్రయించాడు

కర్నూలు నుండి నాగులదిన్నె వరకు సింగవరం, సుంకేసులతో పాటు పలు గ్రామాల మీదుగా రోడ్డు వేసేందుకు కాంట్రాక్టర్ రూ.20 కోట్లతో పని కుదుర్చుకున్నాడు. అప్పటి ప్రభుత్వం బిల్లులు సకాలంలో చెల్లించలేదన్న కారణంతో రెండున్నర ఏళ్ల క్రితం జి.సింగవరంతో పాటు మరికొన్ని చోట్ల రోడ్డు పనులు నిలిపివేశాడు. కోర్టును ఆశ్రయించాడు. అందువల్ల జోక్యం చేసుకోలేకపోతున్నాం.

- రాజా ఫణిరామ్, జెఈఈ, ఆర్ అండ్ బి శాఖ, కర్నూలు.

ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదు

గ్రామ రోడ్డు సమస్యపై వివిధ స్థాయిల్లో అధికారులను అనేకమార్లు కలిశాం. ఎవరిని ఎన్నిసార్లు కలిసినా పరిస్థితిలో ఎలాంటి మార్పు లేదు. సమస్య ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉంది. ప్రభుత్వం సమస్యపై దృష్టి పెట్టి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలి.

- నాగేంద్ర నాయుడు, గ్రామ సర్పంచి, జి.సింగవరం.

బాధితులకు సత్వర న్యాయం

- శాంతిభద్రతల పరిరక్షణకు గట్టి చర్యలు తీసుకోవాలి
- కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించే బాధితులకు సత్వర న్యాయం చేయాలని కర్నూలు రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో డిఎస్పీలు, సిఐలు, ఎస్సైలతో ఎస్పీ జి.బిందు మాధవ్‌తో కలిసి డిఐజి గురువారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. దీర్ఘకాలంగా ఉన్న పెండింగ్ కేసుల గురించి సమీక్షించారు. పోలీసుస్టేషన్ల వారీగా కేసుల పెండింగ్ కు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అల్లరి మూకలు, ఫ్యాక్షన్ చరిత్ర కలిగిన వారిపై గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. రాబరీ, డెకాయిటి వంటి కేసులపై దర్యాప్తులు పకడ్బందీగా చేయాలన్నారు. కేసులు నమోదు చేసే విషయంలో నిజ నిర్ధారణ చేసుకోవాలన్నారు. బాధితుడికి న్యాయం చేయాలన్నారు. ప్రాపర్టీ , ఛీటింగ్, సైబర్ ఫ్రాడ్స్ కేసులలో ఫిర్యాదులు వస్తే వెంటనే కేసులు నమోదు చేయాలన్నారు. నిందితులను ట్రేస్ చేయాలన్నారు. నిందితుల బ్యాంకు ఖాతాలలోని నగదును సీజ్ చేయాలన్నారు. రికవరీ చేసిన మొత్తాన్ని బాధితులకు అందజేయాలన్నారు. డిఎస్పీ స్థాయి అధికారులు ప్రత్యేక దష్టి సారించాలన్నారు. గ్రామాల ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలన్నారు. మంచి పేరు తెచ్చుకోవాలన్నారు. ఘర్షణలు, గొడవలు జరగకుండా కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. పోలీసుస్టేషన్‌లను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పోలీసుస్టేషన్ ఆశ్రయించే వారి పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలన్నారు. నాటుసారా కాసే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. జాతీయ రహదారులలో మలుపుల వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు, విపత్తు నిర్వహణల పై , పాఠశాల ఉపాధ్యాయులు, ఇతర శాఖల సమన్వయంతో పాఠశాల విద్యార్థులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. ఎస్పీ జి.బిందు మాధవ్ మాట్లాడుతూ డిఐజి ఆదేశాలతో శాంతిభద్రతల పరిరక్షణకు గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. నేర నివారణే ప్రథమ ధ్యేయంగా పోలీసులు పనిచేయాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. విధుల్లో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులకు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు, నగదు రివార్డులను ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్ మల్లికార్జున రావు, డిఎస్పీలు వెంకట్రామయ్య, శ్రీనివాసాచారి, సోమన్న, ఉపేంద్ర బాబు, శ్రీనివాసరావు, ట్రైనీ డిఎస్పీ ధీరజ్, సిఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

నా పేరు చెప్పి బెదిరిస్తే

పోలీసులకు ఫిర్యాదు చేయండి : మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

తన పేరు చెప్పుకొని ఎవరైనా బెదిరింపులకు పాల్పడితే వారిపై వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్ అన్నారు. తన పేరును వాడుతూ డబ్బుల కోసం బెదిరిస్తున్నట్లు వస్తున్న వార్తలపై మంత్రి టిజి భరత్ గురువారం ఓ ప్రకటనలో ఘాటుగా స్పందించారు. చట్టవిరుద్ధమైన కార్యకలాపాలను తాను ఎప్పటికీ ప్రోత్సహించనని మంత్రి పేర్కొన్నారు. నిజాయితీగా ఉంటూ దశాబ్దాలుగా ప్రజాక్షేత్రంలో ఉన్నామని, తన పేరును దుర్వినియోగం చేస్తూ ప్రజలను, ఇతర వర్గాలను ఇబ్బందులు పెడితే సహించబోనని హెచ్చరించారు. తాను ఏ పని చేసినా పారదర్శకంగా ఉంటుందని, ఇది ఎప్పటికీ ఇలాగే కొనసాగుతుందన్నారు. ప్రజలందరూ ఇది గుర్తుంచుకోవాలని కోరారు. అవినీతిపరులు, అక్రమార్కుల నుండి ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా ముందుకొచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

విశాఖ ఉక్కు పరిశ్రమ రక్షణకు దీక్షలు

- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఎపిలో ఉన్న ఏకైక భారీ పరిశ్రమ విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కాకుండా కాపాడుకోవడం కోసం కార్మిక సంఘాలు, రైతు సంఘాలు, విద్యార్థి యువజన, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అక్టోబర్ 1, 2, 3 తేదీలలో దీక్షలు చేపడుతున్నట్లు కార్మిక, రైతు సంఘాల నాయకులు తెలిపారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేయకుండా చూడాలని కోరుతూ కార్మిక కర్షక భవన్లో సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.ఎస్.రాధాకృష్ణ అధ్యక్షతన గురువారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, ఏఐయుటియుసి జిల్లా కార్యదర్శి నాగన్న, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి లలితమ్మ, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎండి అంజిబాబు, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నాగేష్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు సోమన్న పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ ఎన్నో త్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను నష్టాల్లోకి నెట్టివేసి ప్రైవేటీకరణ చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. విశాఖ ఉక్కులో పనిచేస్తున్న ఉద్యోగులకు విఆర్ఎస్ ఇచ్చి ఇంటికి పంపించే ప్రయత్నాలు చేస్తున్నారని, మరొక 500 మంది ఉద్యోగులను పక్క రాష్ట్రాల ఫ్యాక్టరీలకు బదిలీ చేసే దానికోసం ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని విమర్శించారు. ప్రారంభంలో ఉత్పత్తి సామర్థ్యం 73 లక్షల టన్నులు ఉండగా గత సంవత్సరం 45 లక్షలకు, ఈ సంవత్సరం 25 లక్షలకు తగ్గించేశారని విమర్శించారు. దేశంలో ఉన్న అన్ని స్టీల్ ప్లాంట్లకు సొంత గనులు ఉన్నప్పటికీ విశాఖ ఉక్కు మాత్రం సొంత గనులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల 45 వేల కోట్ల రూపాయలు అదనపు భారం పడుతుందని అన్నారు. ఎన్నికల కంటే ముందు టిడిపి, జనసేన విశాఖ ఉక్కు సామర్థ్యాన్ని పెంచేందుకు కృషి చేస్తామని హామీలు ఇచ్చారని నేడు విశాఖ ఉక్కు ప్రైవేటుకరణ దిశగా ప్రయత్నాలు కొనసాగిస్తూ ఉంటే నోరు మెదపడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఉన్న సంకీర్ణ ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు అడ్డుకట్ట వేసే విధంగా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. ఒకటిన విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు, రెండో తేదీన కార్మిక సంఘాలు, మూడో తేదీన రైతు సంఘాలు దీక్షలు చేయనున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సురేంద్ర యాదవ్, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి : కలెక్టర్

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని పరిసరాల పరిశుభ్రత పాటించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ఉన్న అన్ని కార్యాలయాలను కలెక్టర్ సందర్శించి శుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లో ఉన్న పార్కులను సక్రమంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కర్నూలు మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఎక్కడైనా గుంతలు ఉంటే వాటిని చిప్స్‌తో కవర్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. బాత్‌రూములను శుభ్రంగా ఉంచు కోవాలన్నారు. కొన్ని శాఖల కార్యాలయాల బయట చెత్త ఎక్కువగా ఉందన్నారు. వాహనాల పార్కింగ్ క్రమబద్ధంగా ఉండేలా శాఖల వారీగా వాహనాల పార్కింగ్‌కు స్థలాలను గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. అంతకు ముందు కలెక్టరేట్ ప్రాంగణంలో మొక్కల పెంపకం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ చేపట్టారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా.బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ చిరంజీవి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటి నీళ్లు పోస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

మాట్లాడుతున్న ఆనంద్‌బాబు

గుర్రం జాషువా జయంతిని జయప్రదం చేద్దాం : కెవిపిఎస్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నవయుగ కవి వైతాళికుడు గుర్రం జాషువా జయంతి వేడుకలను జిల్లావ్యాప్తంగా జయప్రదం చేద్దామని, జాషువా స్ఫూర్తితో కాటికాపర్ల సమస్యల పరిష్కారానికి ఉద్యమిద్దామని కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎమ్‌డి.ఆనంద్ బాబు కోరారు. గురువారం నగరంలోని శ్రీరామ్ నగర్‌లో ఉన్న భగత్ సింగ్ గ్రంథాలయంలో కెవిపిఎస్ శ్రీరామ్ నగర్ వార్డ్ కమిటీ సమావేశం నిర్వహించారు. కెవిపిఎస్ వార్డు అధ్యక్షులు జాన్సన్ అధ్యక్షత వహించారు. ఆనంద్ బాబు, కెవిపిఎస్ న్యూ సిటీ కార్యదర్శి ఎం.భాస్కర్, మాజీ నగర కార్యదర్శి ఆర్.నరసింహులు, దళిత ఉద్యోగుల సంఘం నాయకులు ఈశ్వరయ్య పాల్గొని మాట్లాడారు. ఈనెల 27న జిల్లావ్యాప్తంగా గుర్రం జాషువా జయంతి నిర్వహించడంతోపాటు శ్మశానంలో వృత్తి నిర్వహించే కాటికాపరి, గుంతలు తీసే బేగరి, సల్వాది, ఎటోళ్ల సమస్యలపై ఉద్యమించాలని కోరారు. వారి సమస్యలపై రాష్ట్రవ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టేలా నవంబర్‌లో రాష్ట్రస్థాయి మహాసభను కర్నూలులో నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలోని పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామంలో దళిత మహిళపై జరిగిన దాడిలో పాల్గొన్న అందరిపై కేసు నమోదు చేయాలని ఈనెల 27న ఆదోని ఆర్‌డిఓ కార్యాలయం ముందు జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. అక్టోబర్ 2 నుంచి 8 వరకు సంఘ ఆవిర్భావ వారోత్సవాలు నిర్వహించాలన్నారు. కెవిపిఎస్ వార్డు కార్యదర్శి బాబురావు, నాయకులు ఆంజనేయులు, నల్లన్న, మద్దిలేటి, శ్రీనివాసులు, ఏసేపు, జాన్ పాల్, విజయుడు, దేవయ్య, కిరణ్, అజయ్, వినోద్, రాజు, రవి, ప్రసాద్, నాగరాజు, వెంకటరమణ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి యువజనోత్సవం ప్రారంభం

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి యువజనోత్సవ వేడుకలు ప్రారంభమయ్యాయి. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వివి.సుబ్రహ్మణ్య కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సెట్కూరు సిఇఒ దీప్తి హాజరయి మాట్లాడారు. విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను ఇలాంటి వేదికల ద్వారా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంత ఉత్సాహభరిత వాతావరణంలో సాంస్కృతిక పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి అక్కడే బహుమతులను అందజేశారు. జూనియర్ జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సోమశివారెడ్డి, ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాగ స్వామి నాయక్, రిటైర్డ్ సెట్కూరు సిఇఒ రమణ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బిఆర్.ప్రసాద్ రెడ్డి, అధ్యాపకులు డాక్టర్ ఎం.ఫామీద బేగం, రచయిత డాక్టర్ ఎం.హరికిషన్ పాల్గొన్నారు.

ఐలమ్మ ఆశయాలను కొనసాగిద్దాం

- రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

ఐలమ్మ ఆశయాలను కొనసాగిద్దామని రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురు శేఖర్ కోరారు. గురువారం ఎపి రజక వృత్తిదారుల సంఘం కర్నూలు న్యూ సిటీ కమిటీ ఆధ్వర్యంలో ఐలమ్మ జయంతిని సంఘం జిల్లా కార్యాలయంలో సి.శేషాద్రి అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా నాయకులు ఐలమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐలమ్మ జనగాం జిల్లా రాయపర్తి మండలం కృష్ణారం గ్రామంలో ఓరుగంటి మల్లమ్మ, సాయిలు దంపతులకు 1895 లో జన్మించిందన్నారు. చిట్యాల నరసయ్యను వివాహం చేసుకుని పాలకుర్తి చేరుకుందన్నారు. అప్పటికే గ్రామాలలో హిందూ దొరలు, పటేల్, పట్వారీలు ప్రజలను పీడించి, శిస్తుల పేరుతో వసూళ్లు చేసి జల్సాగా బ్రతికేవారని, వెట్టి చాకిరీతో సకల చేతివృత్తుల వారు హింసింపబడ్డారని తెలిపారు. ఐలమ్మ తన ఇంటిని కమ్యూనిస్టు ఆఫీసుగా ఇచ్చిందన్నారు. ఐలమ్మ భర్త, కొడుకులు కమ్యూనిస్టు దళ నాయకులుగా నైజాం వ్యతిరేక రైతాంగ సాయుధ పోరాటం మొదలైందని, చివరకు నైజాం గద్దె దిగారని చెప్పారు. నైజాం ప్రభువును కుప్పకూల్చిన అగ్నికణం ఐలమ్మ అని తెలిపారు. అనంతరం రజక వృత్తిదారుల సంఘం నూతన శాఖ కార్యదర్శిగా సిహెచ్ శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి రాముడు, కార్యవర్గ సభ్యులు సిహెచ్ సాయిబాబా, రజక వృత్తిదారుల సంఘం న్యూ సిటీ అధ్యక్షుడు రాముడు, జిల్లా కమిటీ సభ్యురాలు సి జయమ్మ పాల్గొన్నారు. **హోళగుంద**లోని మడివాల మాచ్చయ్య గుడి ఆవరణంలో చాకలి ఐలమ్మ చిత్రపటానికి కురుకుంద నాగరాజు పూలమాల వేసి నివాళులర్పించారు. లక్ష్మన్న, మల్లికార్జున, నాగరాజు, కరెంటు మల్లి, యశ్వంత్, వీరన్న పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నాయకులు

క్లాప్ డ్రైవర్ల ఆకలి బాధలు తీర్చాలి

- సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి విజయ్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

జీతాలు రాక ఆకలితోనే కర్నూలు నగరాన్ని శుభ్రం చేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర క్లాప్ డ్రైవర్ల ఆకలి బాధలు తీర్చాలని సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర క్లాప్ డ్రైవర్ల 9నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ ఆఫీస్ ముందు సిఐటియు నగర నాయకులు కుమార్ అధ్యక్షతన ధర్నా చేపట్టారు. సిఐటియు ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి మారెళ్ళ విజయ రామాంజనేయులు మాట్లాడుతూ కర్నూలు నగర పరిధిలో పనిచేసే క్లాప్ డ్రైవర్లకు 9 నెలలుగా పెండింగ్లో జీతాలు ఉండటం వల్ల కార్మికుల కుటుంబాల గడవక చాలా అవస్థలు పడుతున్నారన్నారు. చెత్త లేని నగరంగా పరిశుభ్రంగా ఉందంటే క్లాప్ డ్రైవర్ల కష్ట ఫలితమేనని గుర్తు చేశారు. కమిషనర్ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడం ఎంత ముఖ్యమో ఆ పని చేసిన కార్మికుల జీతాలు ఇప్పించడం కూడా అంతే ముఖ్యమని గుర్తించాలన్నారు. స్టాండింగ్ కమిటీలో క్లాప్ డ్రైవర్ల 4 నెలల పెండింగ్ జీతాలు మంజూరు చేసి రోజులు గడుస్తున్న కార్మికులకు జీతాలు ఇవ్వలేదన్నారు. మున్సిపల్ అధికారులు ప్రజలు, కార్మికుల పక్షాన నిలవాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షాన కార్మికులకు న్యాయం జరిగేంత వరకు సిఐటియు పోరాటం చేస్తుందని హెచ్చరించారు. అనంతరంఒ మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అతి త్వరలో క్లాప్ డ్రైవర్ల జీతాలు చెల్లిస్తామని కమిషనర్ హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ధర్నా చేపడుతున్న నాయకులు

గ్రామాల్లో పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి - సి బెళగల్

మండలంలోని యనగండ్ల, కొండాపురం, గుండ్రేవుల గ్రామాల్లో ఎఒ మల్లేష్ కుమార్ గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు. రైతులకు సలహాలు, సూచనలు అందించారు. జీవామృతం మిశ్రమాన్ని వారం తర్వాత పొలాలకు పిచికారీ చేస్తే ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, వ్యవసాయ శాఖ సిబ్బంది శేఖర్, ఉదయ్, ఈశ్వర్, రైతులు పాల్గొన్నారు.

గడియారం ఆసుపత్రిలో మౌలిక వసతులు కల్పించాలి

- సిపిఎం నగర కార్యదర్శి రాజశేఖర్

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

నగరంలోని పాత బస్తీలో ఉన్న గడియారం ఆస్పత్రిలో వైద్యులు, నర్సు, సిబ్బందిని నియమించి, మౌలిక వసతులు కల్పించాలని సిపిఎం నాయకులు కోరారు. గురువారం నగర పాలక సంస్థ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్, నగర కార్యదర్శి వర్గసభ్యులు ఎం.విజయ్ ఎస్ఎమ్‌డి.షరీఫ్, కె.రామ కృష్ణ, అబ్దుల్ దేశాయ్, నగర నాయకులు మహబూబ్ బాషా, కుమార్ మాట్లాడారు. గడియారం ఆస్పత్రి కాన్పులకు ప్రత్యేకమైన గుర్తింపు పొందిందని తెలిపారు. చుట్టుపక్కల గ్రామాల వారు ఎద్దుల బండ్లు కట్టుకొని ఆస్పత్రిలో కాన్పుల కోసం వచ్చేవారని చెప్పారు. అలాంటి ఆస్పత్రిలో నేడు చిన్న పాటి వర్షమొచ్చినా వాగులు, వంకలు పొర్లినట్లు మురుగునీరు చేరుకుంటుందని తెలిపారు. శాశ్వత పరిష్కారం చూపకపోవడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఆస్పత్రిలో అల్లోపతి డిస్పెన్సరీ ఉందని, ఇక్కడ మేల్, ఫిమేల్ వైద్యులు, నర్సు, సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఈ పోస్టులను ఇప్పటివరకు భర్తీ చేయలేదని చెప్పారు. అలాగే మదర్ అండ్ చైల్డ్ హాస్పిటల్‌కు సంబంధించి గైనిక్ వైద్యులు, ఆయాలు, నర్సులు లేకపోవడం విచారకరమని తెలిపారు. ఆస్పత్రిలో వైద్యులు, నర్సులను, సిబ్బందిని నియమించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

48,897 మంది ప్రజల అభిప్రాయాల సేకరణ

- కలెక్టర్ రంజిత్ బాష

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్ రూపకల్పనకు ఇప్పటి వరకు జిల్లాలో 48,897 మంది క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలను తెలియజేశారని కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. గురువారం ఆయన మాట్లాడారు. అభిప్రాయాలు తెలియజేసిన వారిలో 5,124 మంది విద్యార్థులు, 12,017 మంది రైతులు, 11,051 మంది సెల్ఫ్ ఎంప్లాయిడ్/బిజినెస్ వర్గాలు, 5,669 మంది ప్రయివేట్ ఉద్యోగులు, 10,412 మంది ప్రభుత్వ ఉద్యోగులు, 4624 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. అలాగే జిల్లాలో 619 గ్రామసభలు నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో 1.69 లక్షల మంది ప్రజలు పాల్గొన్నారన్నారు. 7.40 లక్షలు స్టిక్కర్స్, 7.40 లక్షలు కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేసినట్లు తెలిపారు.

నూతన మైనింగ్ డిడిగా రవిచంద్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా మైనింగ్ శాఖ నూతన డిడిగా వి.రవిచంద్ బదిలీపై రానున్నారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం ఈయన విజయవాడలోని రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ కార్యాలయంలో డిడిగా విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఇటీవల చేపట్టిన బదిలీల్లో భాగంగా ఆయన కర్నూలుకు బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇదివరకు కర్నూలు జిల్లా డిడిగా పనిచేసిన టి.రాజశేఖర్ ఒంగోలు జిల్లా డిడిగా బదిలీ అయ్యారు.

కలెక్టరేట్ ఎఒగా విజయశ్రీ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

కలెక్టరేట్ పరిపాలన అధికారిగా విజయశ్రీ గురువారం ఎఒ ఛాంబర్‌లో బాధ్యతలను స్వీకరించారు. సిబెళగల్ మండలంలో తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న విజయశ్రీ సాధారణ బదిలీలో ఇక్కడికి వచ్చారు. ఇక్కడే పరిపాలన అధికారిణిగా పని చేస్తున్న రాజేశ్వరి కలెక్టరేట్ రెవెన్యూ సెక్షన్‌లోనే నియమితులయ్యారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'కొంతలపాడు' విద్యార్థులు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన బాస్కెట్ బాల్ ఎంపిక పోటీలో ఆర్.కొంతలపాడు పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కొంతలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో జరిగిన అభినందన సభలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సావిత్రి పాల్గొని మాట్లాడారు. తమ పాఠశాల నుంచి బాస్కెట్ బాల్ జిల్లా జట్టుకు ఎస్.శివవాణి, కె.లీలావతి బాలికల విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంపికయ్యారని తెలిపారు. బాలుర విభాగంలో ఆర్.మహేష్, కె.అజయ్ ఉత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని చెప్పారు. అండర్–17 విభాగంలో బాస్కెట్ బాల్ జిల్లా జట్టుకు బాలుర విభాగంలో హెచ్‌ఆర్.రామ్ చరణ్ చక్కటి క్రీడా ప్రతిభను కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని తెలిపారు. బాలికల విభాగంలో కె.రాణి ప్రతిభను కనపరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులకు ఉత్తమ నైపుణ్యాలను నేర్పించిన పీడీ రాజశేఖర్‌ను తల్లిదండ్రులు అభినందించారు.

సంక్షేమ పథకాల కోసం ప్రజల్లోకి వెళ్తాం

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - దేవనకొండ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే విరుపాక్షి

సంక్షేమ పథకాల అమలు కోసం ప్రజల్లోకి వెళ్తామని ఎమ్మెల్యే బి.విరుపాక్షి తెలిపారు. గురువారం దేవనకొండ క్రాస్ రోడ్డులోని ఆర్ఆర్ ఫంక్షన్ హాలులో కొత్తపేట వైసిపి నాయకుడు బాబు కుమార్తె వివాహ వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి ప్రభుత్వం 100 రోజుల పాలన గురించి 'ఇది మంచి ప్రభుత్వం' అనే కార్యక్రమాన్ని ఆర్భాటంగా చేస్తోందని, ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల్లో కేవలం పింఛన్ పెంపు తప్ప సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. వాటి అమలుకు 2025 జనవరి నుండి ప్రజల్లోకి వెళ్తామని తెలిపారు. విజయవాడలో వరదల్లో నిరాశ్రయులైన ప్రజలకు చేయూతనందిం చడంలో టిడిపి ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. రూ.10 వేల వరద సహాయం అనేక కుటుంబాలకు అందించలేకపోయారని తెలిపారు. సూపర్ సిక్స్ సంక్షేమ పథకాల అమలులో ప్రజలను మరిపించడానికి తిరుపతి లడ్డు వివాదాన్ని తెరపైకి తెచ్చారని మండిపడ్డారు. ఎన్నికల్లో జనసేన పార్టీకి యువత, ప్రజలు మద్దతు ఇచ్చి ఓట్లు వేశారని, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా సూపర్ సిక్స్ పథకాలపై ఎలాంటి ప్రకటనలూ చేయకపోవడం శోచనీయమని అన్నారు. జడ్పిటిసి కిట్టు, ఎంపిపి భర్త లుముంబా, వైసిపి మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, తెర్నేకల్ సర్పంచి అరుణ్ కుమార్, వైసిపి నాయకులు దివాకర్ రాయుడు, రాజన్న, గఫూర్, ప్రతాప్, పల్లెదొడ్డి చంద్రన్న, తిరుమలేష్ నాయుడు పాల్గొన్నారు.

మండల పరిస్థితులపై సబ్ కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి - మంత్రాలయం

సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

మంత్రాలయం మండల పరిస్థితులపై సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆరా తీశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో తహశీల్దార్ ఎ.రవి అధ్యక్షతన అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వంద రోజుల పాలనపై వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. 2047 నాటికి స్వర్ణాంధ్రగా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులు ముమ్మురం

- ఇన్‌ఛార్జీ ఇఒఆర్‌డి బాలన్న

ప్రజాశక్తి - చిప్పగిరి

నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న బాలన్న

నీరు నిల్వ లేకుండా ఎక్కడికక్కడే డ్రెయినేజీ నిర్మాణ పనులను చేపట్టినట్లు ఇన్‌ఛార్జీ ఇఒఆర్‌డి బాలన్న తెలిపారు. గురువారం నేమకల్లు గ్రామంలో సర్పంచి ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో పంచాయతీ నిధుల ద్వారా డ్రెయినేజీ నిర్మాణ పనులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను, గ్రామం నుంచి స్థానిక బస్టాండ్ వరకు ఇరువైపులా ఉన్న ముళ్ల చెట్లను జెసిబి ద్వారా తొలగించారు. ఈ సందర్భంగా బాలన్న మాట్లాడారు. ఈ పనులన్నీ పంచాయతీ నిధుల ద్వారా చేపట్టామన్నారు. శుద్ధజల కేంద్రం దగ్గర నీరు నిల్వ ఉండడంతో అక్కడ పరిసరాలు, దోమలు వ్యాప్తి చెంది ఎక్కువ ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో వెంటనే స్పందించి డ్రెయినేజీ నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేస్తున్నామన్నారు. పాఠశాలకు పక్కన ఉన్న రహదారికి గ్రావెల్ కూడా వేస్తున్నామన్నారు.

సెపక్ తక్ర విజేతకు తిక్కారెడ్డి అభినందన

ప్రజాశక్తి - ఆలూరు

క్రీడాకారుడు మధును శాలువాతో సన్మానిస్తున్న తిక్కారెడ్డి

ఆలూరు నుంచి అంతర్జాతీయ స్థాయిలో ఆసియా బీచ్ సెపక్ తక్ర ఛాంపియన్ షిప్-2024 క్రీడా పోటీల్లో కాంస్య పతకం సాధించిన కురువ మధును టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అభినందించారు. గురువారం టిడిపి ఆలూరు కార్యాలయంలో తిక్కారెడ్డి, టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జీ వీరభద్రగౌడ్ మధును శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడారు. పేద కుటుంబంలో పుట్టి చదువుకుంటూ క్రీడలో రాణిస్తూ భారతదేశ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఈనెల 18 నుంచి 23 వరకు చైనాలో జరిగిన క్రీడా పోటీలో ఆడి కాంస్య పతకం సాధించడం హర్షించదగ్గ విషయమని తెలిపారు. మండల కన్వీనర్ అశోక్, రవి, గోవిందు, వన్నూరు వలీ, రాము పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఇన్‌ఛార్జీ ఆచూకీ ఎక్కడ..?

- ఎన్నికల తర్వాత తెరచుకోని కార్యాలయం

- నిరుత్సాహ పడుతున్న పార్టీ శ్రేణులు

ప్రజాశక్తి - ఆలూరు

కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ కనబడడం లేదు. రాష్ట్ర విభజన పాపం మూటగట్టుకున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో దాదాపు కనుమరుగైంది. రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేసే బాధ్యతను అధిష్టానం వైఎస్.షర్మిళను పెట్టింది. ఆమె కూడా కృషి చేశారు. 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేడర్‌లో మంచి ఊపు వచ్చింది. నియోజకవర్గంలో వామపక్షాల సహకారంతో దాదాపు 5 వేల ఓట్లు పడ్డాయి. కేడర్‌ను నిలబెట్టుకోవాల్సిన ఇన్‌ఛార్జీ అందుబాటులో లేకపోవడంతో కేడర్ నిరుత్సాహానికి గురవుతోంది.

కాంగ్రెస్ కార్యాలయం

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని పిసిసి అధ్యక్షులు వైఎస్.షర్మిళ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జీ అరకట్ల నవీన్ కిషోర్ మాత్రం సార్వత్రిక ఎన్నికల తర్వాత కనపడకుండా పోయారు. ఆయన ఆచూకీ లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నిరుత్సాహ పడుతున్నాయి. రాష్ట్ర విభజన పాపం మూటగట్టుకున్న కాంగ్రెస్ పార్టీ 2014 ఎన్నికల తర్వాత రాష్ట్రంలో పూర్తిగా తుడిచిపెట్టుకు పోయింది. 2024 ఎన్నికల సమయంలో రాష్ట్రంలో పార్టీకి పూర్వ వైభవం తెచ్చే బాధ్యతను కాంగ్రెస్ పార్టీ అధిష్టానం వైఎస్.షర్మిళపై పెట్టింది. ఆమె కూడా వామపక్షాలతో కలిసి ఎన్నికల్లో పోటీ చేసిన కొన్ని స్థానాల్లో గట్టి పోటీ ఇచ్చారు. ఆమె రాకతో పార్టీలో కొంత ఊపు వచ్చింది. ఆ అవకాశాన్ని ఉపయోగించుకొని ఆలూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ అరకట్ల నవీన్ కిషోర్ ఎలాంటి చొరవా చూపడం లేదు. ఎన్నికలు కేవలం నెల రోజుల ముందు నవీన్ కిషోర్ పార్టీ 'బి' ఫారం తెచ్చుకున్నారు. వామపక్షాలు పూర్తిగా సహకారం అందించడంతో 5 వేలకు పైగానే ఓట్లు పొందారు. నియోజకవర్గానికి కొత్త మొహమైన అరకట్లకు 5 వేల ఓట్లు పొందడమంటే ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఇంకా అభిమానం చూపుతున్నారనే విషయం స్పష్టమవుతోంది. ప్రజల్లో కాస్తో కూస్తో అభిమానం ఉన్న కాంగ్రెస్ పార్టీని పటిష్ట పరచాలంటే అరకట్ల అందుబాటులో ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేయాల్సి ఉంది. కాగా ఆయన అందుబాటులో లేరు. ఎన్నికలు ముగిసి 4 నెలలు కావస్తున్నా ఏ రోజు కూడా ఆలూరు నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో లేరు. 4 నెలల నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యాలయానికి వేసిన తాళాలు తీసిన దాఖలాలు కూడా లేవు. ఆయన రాజకీయాలను 'పార్ట్ టైం జాబ్'గా భావిస్తూ బెంగళూరులో వ్యాపారాలు చేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. 2014 ఎన్నికల తర్వాత స్తబ్దుగా ఉన్న కాంగ్రెస్ కేడర్‌లో 2024 ఎన్నికల్లో మంచి ఊపు వచ్చింది. ఈ ఊపు అలాగే కొనసాగాలంటే పార్టీ ఇన్‌ఛార్జీ కేడర్‌కు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ఇన్‌ఛార్జీ అరకట్ల నవీన్

నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీకి పెద్ద దిక్కు లేకపోవడం, పార్టీ కార్యాలయం ఎప్పుడూ తాళం వేసి ఉండడంతో కాంగ్రెస్ కేడర్ నిరుత్సాహానికి గురవుతోంది. పిసిసి అధ్యక్షులు షర్మిళ, డిసిసి అధ్యక్షులు మురళీ కృష్ణ స్పందించి ఆలూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసే వ్యక్తిని నియమించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కోరుతున్నారు.

మురుగును పంచాయతీ కార్యదర్శికి చూపుతున్న వైద్యాధికారి

కైరవాడి, వెముగోడు గ్రామాల్లో

మరో రెండు డెంగీ కేసులు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని చిన్నమరివీడు గ్రామంలో బుధవారం డెంగీ కేసు నమోదు కాగా హెచ్.కైరవాడి, వెముగోడు గ్రామాల్లో మరో రెండు కేసులు నమోదయినట్లు జిల్లా మలేరియా నివారణాధికారి నూకరాజు తెలిపారు. అప్రమత్తమైన వైద్యాధికారులు, సిబ్బంది ఆయా గ్రామాలను సందర్శించి ఇంటింటికీ తిరిగి లార్వా నమూనాలను సేకరించడం, దోమల నివారణకు ద్రావణాన్ని పిచికారి చేయించడం, గ్రామంలోని ప్రధాన వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ఇంటి పరిసరాల్లో మురుగునీరు నిలవకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని గ్రామస్తులకు తెలియజేశారు. గ్రామ పంచాయతీల్లో ప్రధానంగా పారిశుధ్య పనులు లోపించడంతో డెంగీ కేసులు నమోదవుతున్నట్లు వారు తెలిపారు.

కమిషనర్‌పై ఎమ్మెల్యే బీవీ ఆగ్రహం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వీధి కుక్కలను నియంత్రించకపోతే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిపై ఎమ్మెల్యే డాక్టర్ బీవ.జయ నాగేశ్వర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎమ్మెల్యే బీవీ పట్టణంలో పర్యటించారు. పట్టణంలోని వీధుల్లో కుక్కలు సంచరించడంతో ద్విచక్ర వాహనదారులకు, పాదచారులకు, వాహనదారులకు ఇబ్బంది కలుగుతోందని తెలిపారు. వారిపై దాడి చేసి కరుస్తున్నాయని చెప్పారు. తక్షణమే చర్యలు తీసుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

మెడికల్ కళాశాల, హైవే నిర్మాణం పూర్తి చేస్తాం

- చంద్రబాబుతో ఓపెన్ చేయిస్తాం - టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో అసంపూర్తిగా ఉన్న మెడికల్ కళాశాల, హైవే రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయించి ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఓపెన్ చేయిస్తామని టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి తెలిపారు. గురువారం వైఎంకె మైదానంలో 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ కృష్ణ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, మున్సిపల్ చైర్మన్ శాంత, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప, టిడిపి ఆర్గనైజింగ్ రాష్ట్ర కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్తిని కుబేర్‌నాథ్, టిడిపి బీసీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ తిమ్మప్ప హాజరయ్యారు. ఈ సందర్భంగా తిక్కారెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వ ఒంటెత్తుపోకడ వల్ల అభివృద్ధి కుంటపడిందని తెలిపారు. మెడికల్ కళాశాలను పూర్తి చేయకుండా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. అసంపూర్తిగా ఉన్న హైవే రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించి, రైల్వే ట్రాక్‌పై ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టి, ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఓపెన్ చేయిస్తామని తెలిపారు. డాక్టర్ పార్థసారథిని ఎమ్మెల్యేగా గెలిపించాలని చంద్రబాబు సూచన మేరకు ఇచ్చిన మాటను నాయుడు కుటుంబం నిలుపుకుందని, వారికి త్వరలోనే గౌరవం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మాట్లాడుతూ... రైల్వే గేటు కింద అండర్ గ్రౌండ్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తే వ్యవసాయ మార్కెట్ యార్డుకు రాకపోకలు సాగించేందుకు అనుకూలంగా ఉంటుందని, ఆ దిశగా ఎమ్మెల్యే కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి మాట్లాడుతూ... తాను ఎమ్మెల్యేగా గెలిచిన నాటి నుండి ఆదోనిలో దౌర్జన్యాలు, భూ కబ్జాలు లేవని తెలిపారు. అలాంటి వాటిని ప్రోత్సహించే గత ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని చెప్పారు. టిడిపి జిల్లా అధ్యక్షుని హోదాలో ఆదోనికి వచ్చిన తిక్కారెడ్డికి మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. ఆదోని బైపాస్ నుంచి వైఎంకె మైదానం వరకు మున్సిపల్ రోడ్డు మీదుగా టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి ఆధ్వర్యంలో వందలాది బైక్‌లతో ప్రదర్శన చేపట్టారు. నాయకులు ఉమాపతి నాయుడు, మారుతి నాయుడు, రంగస్వామి నాయుడు, బుద్ధారెడ్డి, తిమ్మప్ప, వెంకటేష్, జయరామ్, చిట్టి, రాజు ఉన్నారు.


ఆదోనిలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి, మీనాక్షి నాయుడు

వెనుదిరిగిన టిడిపి కార్యకర్తలు

కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు మాట్లాడే వరకు ఈలలు, కేకలు వేస్తూ కార్యకర్తలు కేరింతలు కొట్టారు. ఆయన ప్రసంగం ముగించగానే కార్యకర్తలు బయటకు వెళ్లిపోయారు. జనసేన ఇన్‌ఛార్జీ మల్లప్ప, ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడాల్సి ఉన్నా కార్యకర్తలు వెనుదిరగడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. ఎవరూ వెళ్లవద్దని మీనాక్షి నాయుడు వారించినా పట్టించుకోకుండా అందరూ వెళ్లిపోవడంతో స్టేజీ మీద ఉన్న వారి ముఖాల్లో కొంత అసంతృప్తి కనపడింది.

ఎమ్మిగనూరు : ప్రజా సంక్షేమం, అభివృద్ధి టిడిపితోనే సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర రెడ్డి తెలిపారు. పట్టణంలోని వార్డుల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా కరపత్రాలను అందజేశారు. మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి పాల్గొన్నారు.

వేదవతి, నగరడోనా రిజర్వాయర్ పూర్తి చేస్తాం

చిప్పగిరి : హాలహర్విలోని వేదవతి, నగరడోనా రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి తీరుతామని టిడిపి జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్, జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షులు రవి యాదవ్ తెలిపారు. రామదుర్గం గ్రామంలో ఎంపిడిఒ కొండయ్య ఆధ్వర్యంలో 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తిక్కారెడ్డి హాజరయ్యారు. వేదవతి రిజర్వాయర్ పనులను పూర్తి చేసి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రిబ్బన్ కట్ చేసి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. టిడిపి ఆలూరు కన్వీనర్ అశోక్ యాదవ్, సర్పంచులు నీలకంఠ, పురుషోత్తం, సావిత్రి, సుశీలమ్మ, టిడిపి సీనియర్ నాయకులు తిమ్మయ్య, పాముల సన్నప్ప, గుమ్మనూరు అంపయ్య, వన్నాల ఆంజనేయులు, మాజీ ఎంపిటిసి భాస్కర్, మాజీ సర్పంచి శివలింగ, బెల్డోన గోవిందు, సోమశేఖర్ నాయుడు, సురేష్, కొండ గోవిందు, పోతరాజు రాముడు, శ్రీలక్ష్మి, జనార్ధన స్వామి, బోగేష్, అంజి యాదవ్, పులికొండ, హరినాథ్, ఎఒ జయలక్ష్మి, ఇఒఆర్‌డి బాలన్న, ఎపిఎం నాగార్జున, ఎపిఒ మాధవ శంకర్, పంచాయతీ కార్యదర్శి సిసింద్రీ, రెవెన్యూ కార్యదర్శి మల్లికార్జున, జనసేన మండల అధ్యక్షులు చిరంజీవి పాల్గొన్నారు. మాజీ జడ్పిటిసి మీనాక్షి నాయుడు, మాజీ వైస్ ఎంపిపి వెంకటేశులు, టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ, ఎంపిటిసి రజినీ గైర్హాజరు కావడం చర్చనీయాంశంగా మారింది. **కౌతాళం** మండలంలోని ఉప్పర హాల్ గ్రామంలో 'ఇది మంచి ప్రభుత్వం' నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం వంద రోజుల్లో చేసిన అభివృద్ధిని, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. తెలుగు రైతు అధికార ప్రతినిధి పి.సాయి బాబా, టిడిపి మైనార్టీ నాయకులు టిప్పు సుల్తాన్, దస్తగిరి, ఈరన్న, మల్లయ్య పాల్గొన్నారు.

ఎమ్మిగనూరులో కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే బీవీ

చిప్పగిరిలో మాట్లాడుతున్న తిక్కారెడ్డి

ఆదోనిలో వెనుదిరుగుతున్న టిడిపి కార్యకర్తలు

ఉరుకుంద విద్యార్థికి బంగారు పతకం

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని ఉరుకుంద గ్రామం పరిషత్ హై స్కూల్ విద్యార్థి బంగారు పతకం సాధించి, రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు సునీత దేవి, వ్యాయామ ఉపాధ్యాయులు ఈరన్న తెలిపారు. గురువారం వారు మాట్లాడారు. కర్నూలులో జరిగిన జిల్లాస్థాయిలో అండర్-14 విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో 9వ తరగతి చదువుతున్న నాగరాజు మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సాధించారని తెలిపారు. నాగరాజును, అందుకు కృషి చేసిన పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఈరన్నను ప్రధానోపాధ్యాయులు సునీతదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - కౌతాళం

అధిక వర్షాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మల్లయ్య డిమాండ్ చేశారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం ముందు రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసి భారీ వర్షాలకు చేతికొచ్చిన పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సహాయం కింద రూ.20 వేలు రైతుల ఖాతాలో జమ చేయాలని కోరారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకుంటే రైతు సంఘం ఆధ్వర్యంలో దశలవారీ ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. రైతు సంఘం మండల కార్యదర్శి బి.ఈరన్న, నాయకులు ఉల్లిగయ్య, సత్యప్ప, వీరేష్, రామలింగ, వెంకన్న, తాయప్ప పాల్గొన్నారు.

సేవాగుణం అలవరచుకోవాలి

- ఎడిఎ విజయ మోహన్

ప్రజాశక్తి- దేవనకొండ

ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవరచుకోవాలని పత్తికొండ ఎడిఎ విజయ మోహన్, ఎఒ సురేష్ బాబు, సరస్వతి విద్యానికేతన్ కరస్పాండెంట్ కృష్ణమూర్తి తెలిపారు. గ్రామానికి చెందిన గుంటూరు రామారావు 19వ వర్థంతి సందర్భంగా ఆయన కుమారులు వేణుగోపాలరావు, సదాశివరావు ఆధ్వర్యంలో గురువారం దేవనకొండ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 800 మంది విద్యార్థులకు మామిడి మొక్కలను పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో మామిడి మొక్కలు నాటారు. ఈ సంద ర్భంగా వారు మాట్లా డారు. మానవాళి మనుగడకు, పర్యా వరణ పరిరక్షణకు ఉపయోగపడుతున్న మొక్కలను పెంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. పండ్ల మొక్కలను సంరక్షించుకుంటే ఫలాలను అందిస్తాయన్నారు. పంపిణీ చేసిన మామిడి మొక్కలను ఇంటి ఆవరణలో, పొలం గట్లలో నాటుకోవాలని సూచించారు. గ్రామంలో జరిగే అభివృద్ధి పనులకు వేణుగోపాలరావు బ్రదర్స్ ముందు ఉంటారన్నారు. పత్తికొండ, తుగ్గలి ఎఒలు వెంకట రాముడు, పవన్ కుమార్, ఎఇఒ యోగేంద్ర పాల్గొన్నారు.

మామిడి మొక్కలు పంపిణీ చేస్తున్న వేణు గోపాల్ రావు బ్రదర్స్

29న గుండె వైద్య శిబిరం

- డాక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - ఆదోని

ఈనెల 29న గుండె వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మధు ఆస్పత్రి నిర్వాహకులు డాక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. పట్టణంలోని ఎస్‌కెడి కాలనీ మధు ఆస్పత్రిలో గుండెకు సంబంధించిన వైద్య చికిత్సలు అందుబాటులో ఉంటాయని, గుండె వ్యాధిగ్రస్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పట్టణంలో మొట్టమొదటిసారిగా ఎన్‌టిఆర్ వైద్య సేవ (ఆరోగ్యశ్రీ), ఈహెచ్‌ఎస్ ద్వారా సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. అన్ని రకాల హెల్త్ ఇన్స్యూరెన్స్‌ల సౌకర్యం కూడా ఉందన్నారు. డాక్టర్ వి.విశ్వనాథ్ ఎంబిబిఎస్ ఎమ్‌డి డిఎం ఇంటర్నేషనల్ కార్డియాలజిస్ట్ మధు హాస్పిటల్‌లో 24 గంటలూ సేవలందిస్తున్నారని తెలిపారు. ఈ నెల 29న వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ వి.విశ్వనాథ్ ఆధ్వర్యంలో బిపి, జిఆర్‌బిఎస్, ఈసీజీ, డాక్టర్ కన్సల్టేషన్ (ఒపి) ఉచితంగా చూస్తారన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 7095555612, 7095555613 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

ప్రమాదకరంగా తరలించే ఆటోలపై చర్యలు

- సిఐ గంగాధర్

ప్రజాశక్తి - గోనెగండ్ల

పిల్లలను పాఠశాలలకు తరలించే స్కూల్ ఆటోలపై గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు గోనెగండ్ల సిఐ ఎ.గంగాధర్ తెలిపారు. గురువారం గాజులదిన్నె ప్రాజెక్టు క్రాస్ వద్ద అధిక సంఖ్యలో ప్రమాదకరంగా స్కూల్ పిల్లలను తరలిస్తున్న ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చి కేసులు నమోదు చేశారు. మరోసారి పిల్లలను ప్రమాదకరంగా పాఠశాలలకు తరలిస్తే ఆటోలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

పెద్దకడబూరు ఎస్సీ కాలనీలో విద్యుదాఘాతంతో సర్వం కోల్పోయిన మంచోది శాంతిరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి తిక్కన్న, నాయకులు పరమేష్ డిమాండ్ చేశారు. గురువారం పెద్దకడబూరు ఎస్సీ కాలనీలో బాధితులు మంచోది శాంతిరాజు కుటుంబాన్ని పరామర్శించి రూ.2,500 నగదు, నిత్యావసర సరుకులుఅందజేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. తహశీల్దార్ శ్రీనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. సిపిఎం నాయకులు ఈరన్న, హనుమంతు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వై.ప్రదీప్ రెడ్డి రూ.25 వేలు, గ్రామ పెద్ద రామలింగారెడ్డి రూ.15 వేలు, వైసిపి మండల కన్వీనర్ రామ్మోహన్ రెడ్డి రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. సర్పంచి రామాంజనేయులు, వైసిపి నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, ముక్కరన్న, సుందరం పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అధికారుల నిర్లక్ష్యం

- చేతికందే ఎత్తులో విద్యుత్ తీగలు

- ఎత్తు పెంచాలని కాలనీ వాసుల మొర

- పట్టించుకోని విద్యుత్ అధికారులు

ప్రజాశక్తి - హోళగుంద

విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం అక్కడి సామాన్యుల పాలిట శాపంగా మారింది. హోళగుందలోని 7వ వార్డులో బుడగ జంగాల కాలనీలో సుమారు 200లకు పైగా కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కొన్ని నెలలుగా విద్యుత్ తీగలు చేతికందే ఎత్తులో వేలాడుతుండడంతో కాలనీ వాసులు రామాంజి, మల్లేష్, లక్ష్మన్న, రామదాసు, లింగన్న ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే వర్షాకాలం, ఆపై గాలి వస్తే చాలు తీగలు ఒకదానికి ఒకటి రాపిడి జరిగి అగ్ని మంటలు రేగుతున్నట్లు వాపోయారు. గతంలో విద్యుదాఘాతంతో గుడిసెలకు నిప్పంటుకున్నట్లు తెలిపారు. పలుమార్లు విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ తీగల ఎత్తు పెంచాలని కోరుతున్నారు.

తీగల ఎత్తు పెంచాలని కోరుతున్న కాలనీ వాసులు

పోషకాహారం తీసుకోవాలి

మాట్లాడుతున్న సూపర్‌వైజర్ లీలావతి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

గర్భిణులు, బాలింతలు పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ లీలావతి సూచించారు. గురువారం మండలంలోని మదిరె గ్రామంలో పోషకాహార మహోత్సవాలను నిర్వహించి, పోషక పదార్థాలపై అవగాహన కల్పించారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలు గల ఆహారాన్ని తీసుకుంటే బిడ్డ ఎదుగుదల బాగుంటుందన్నారు. పాలు, గుడ్లు, ఆకు కూరలు, పప్పు దినుసులు వంటి ఆహార పదార్థాలను తీసుకుంటే తల్లిబిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ప్రోగ్రామ్ అధికారి సునీత, అంగన్వాడీ కార్యకర్తలు ఎంకమ్మ, ధనలక్ష్మి, సుగుణ, ప్రభావతి, సునీత పాల్గొన్నారు.

వరద బాధితులకు 'విజేత' సాయం

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండలంలోని పెద్దహరివాణం గ్రామంలో ఉన్న విజేత టాలెంట్ ఇంగ్లీష్ మీడియం ప్రైమరీ పాఠశాల విద్యార్థులు, పాఠశాల సిబ్బంది సహకారంతో రూ.5 వేల నిధులు సేకరించారని పాఠశాల కరస్పాండెంట్ హెచ్.శ్రావణి, ప్రధానోపాధ్యాయులు రవి గురువారం తెలిపారు. ఉపాధ్యాయులు గాయత్రి, రమాదేవి, ఉమాదేవి, గాదిలింగమ్మ, మల్లమ్మ, పరమేష్, రంగ స్వామి, కళింగ, హులిగప్ప, శరన్నబసవ పాల్గొన్నారు.

వాలీబాల్ పోటీల్లో 'నేషనల్' ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని

నియోజకవర్గ స్థాయి టోర్నమెంట్‌లో వాలీబాల్ భాగంలో ప్రతిభ చూపడం అభినందనీయమని నేషనల్ విద్యాసంస్థల అధినేత గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గత రెండు రోజులుగా మున్సిపల్ హైస్కూల్‌లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో అండర్-14 విభాగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గురువారం నేషనల్ స్కూల్‌లో అభినందించారు. ఈ సందర్భంగా గోపాల్ రెడ్డి మాట్లాడారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించినప్పుడే ఏకాగ్రత, పట్టుదల పెంపొందుతాయన్నారు. నియోజకవర్గ గవర్నమెంట్‌లో విద్యార్థినులు విజేతలుగా నిలిచారన్నారు. డైరెక్టర్ విజయ్ కుమార్ మాట్లాడారు. పాఠశాలలో కూడా గేమ్స్‌కు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. విజయానికి కృషి చేసిన వ్యాయమా ఉపాధ్యాయులు రవి, గోవిందరాజులును అభినందించారు.

ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని వెముగోడు గ్రామంలో ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో గురువారం శనగ పంటలో మేలైన యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చార. ఈ సందర్భంగా డాట్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ సుజాత మాట్లాడారు. శనగలో మేలు రకాలైన ఎన్‌బిఇజి 452, 857, 776, 1,267 రకాలను అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకు విత్తుకోవాలని తెలిపారు. తక్కువ పెట్టుబడితో మేలైన యాజమాన్య పద్ధతులు చేపట్టి అధిక దిగుబడులు పొందే విధానాన్ని వివరించారు. అనంతరం కంది, వరి లాంటి వివిధ పంటలను ఆశించే తెగుళ్లు, వాటి నివారణ చర్యలను వివరించారు. డ్రోన్ ద్వారా పురుగు మందు పిచికారి విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా చూపించారు. ఎడిఎ ఎస్.మహ్మద్ ఖాద్రీ, ఎఒ హేమలత, సహాయకులు జాకీర్, లక్ష్మన్న పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE (JUNIOR DIVISION) :: ADONI

E.P. No: 164 OF 2023 IN
DISPUTE No: ARC/KNL/156/2015.

Between:-
M/s. Shriram Chits Pvt., Ltd., Rep. by its Legal Manager cum GPA Holder, Adoni
....Decree Holder.
-Vs-
N.Mallikarjuna and Others
.... Judgement Debtors

NOTICE TO JUDGMENT DEBTOR No: 3.

To.
K.Srinivasulu, S/o. K.Urukundapps,
R/o. H.No: 20/416, Venkannapeta, Adoni,
Station Watchman,
Mantralayam Railway station.

Whereas the above named decree holder filed the above execution petition against you for salary attachment. You are hereby order to take notice and appear before this court at 10.30 A.M., on 04/10/2024 in person or through advocate and file your objections if any. Else you will be set exparte and the above execution petition will be decided in your absence.

// By Order of the Court//

Sri C.SOMA SEKHAR,
Advocate for Decree Holder,
Adoni.